విద్యుత్ సమస్యలపై కంట్రోల్ రూమ్‌లు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

తుపాను హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అవాంతరాలను తక్షణమే పరిష్కరించేందుకు విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్ సర్కిల్, రాజమహేంద్రవరం పర్యవేక్షక ఇంజనీర్ టివిఎస్ఎన్.మూర్తి సోమవారం ప్రకటనలో సూచించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని రాజమహేంద్రవరం సర్కిల్ 7382299960, 0883 2463354, రాజమహేంద్రవరం టౌన్ 9490610094, రాజమహేంద్రవరం రూరల్ 9490610003, కాకినాడ 9493178718, పెద్దాపురం 9059034479, జగ్గంపేట 9490610096, 08852-233575, రంపచోడవరం 9440812682, రామచంద్రాపురం 9493178821, 08857243082, అమలాపురం 9440812659 నెంబర్లలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఇవి 24 గంటలూ అందుబాటులో ఉంటాయన్నారు.

ముంచుకొస్తున్న మిచౌంగ్

- తుపానుతో స్తంభించిన జీవనం
- కోటిపల్లి రేవు మూసివేత
- సముద్రంలో వేటపై నిషేధం



ఎస్.యానాంలో ఎగసి పడుతున్న సముద్రపు అలలు

మిచౌంగ్ తుపాను ప్రభావంతో సోమవారం ఉదయం నుంచి ఎడతెరపి లేని భారీ వర్షాలతో జనజీవనం స్తంభించిపోయింది. అధికారులు సహాయక చర్యలపై కసరత్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

రామచంద్రపురంలో ఉదయం నుంచి తుపాను ప్రభావంతో ప్రజలు బయటకు రాని పరిస్థితి నెలకొంది. మార్కెట్లు మూతపడ్డాయి మెయిన్ రోడ్లన్నీ జనసంచారం లేక వెలవెల పోయాయి. కె.గంగవరం మండలంలోని కోటిపల్లి రేవును తుపాను ప్రభావంతో మూసివేశారు. దీంతో పడవలు, పంట్లు ఒడ్డుకు చేరాయి. మత్స్యకారులు గోదావరిలోకి వేటకు వెళ్ళవద్దని తహశీల్దారు వైద్యనాథ్ శర్మ సూచించారు. పాఠశాలలో విద్యాసంస్థలు తుపాను ప్రభావంతో మూతపడ్డాయి. నిత్యవసర వస్తువులు తెచ్చుకునేందుకు సామాన్యులు ఇబ్బందులకు గురి కావాల్సి వచ్చింది.

మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ కె.గంగవరం మండలం కుందూరు, గంగవరం, రామచంద్రపురం మండలంలోని వెలంపాలెం, నెలపర్తిపాడులో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులు అధైర్య పడవద్దని మిల్లర్లకు ధాన్యం కొనుగోలుపై నిబంధనలను సడలించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. రైతులను ప్రభుత్వం ఆదుకునేందుకు సిద్ధంగా ఉందని ఇప్పటికే మిల్లర్లకు ధాన్యం కొనుగోలుపై పాలు సూచనలు చేశామని వివరించారు ఆయన వెంట రామచంద్రపురం ఆర్‌డిఒ సుధాసాగర్, తహశీల్దార్లు ఎం.వెంకటేశ్వరరావు, వైద్యనాథ్ శర్మ ఉన్నారు. భారీ వర్షాలతో రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. ద్రాక్షారామం నుంచి యానాం వెళ్లే మెయిన్ రోడ్డు అన్నాయిపేట వద్ద నుంచి వేగాయమ్మపేట వరకూ, కుయ్యేరు నుంచి కాజులూరు వరకూ, కోలంక నుంచి యానాం వరకూ దారుణంగా మారింది. నదురుబాద, మాలపాడురోడ్డు, వెల్ల, ఆదివారపుపేట, ద్రాక్షారామ రోడ్డు, యర్రపోతవరం, శివల, దంగేరు రోడ్డు, రోడ్డు పూర్తిగా పాడే వర్షాలకు మరింత దారుణంగా తయారయ్యాయి. రామచంద్రపురం పట్టణంలోని శివాలయంలో వీధిలో ఈదురు గాలులకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో 12 విద్యుత్ సర్వీసులు దగ్ధమయ్యాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. విద్యుత్ శాఖ సిబ్బంది స్థానికులు తిరిగి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

ఉప్పలగుప్తం తీర గ్రామాలైన ఎస్.యానాం, వాసాలతిప్ప తదితర గ్రామాల్లో తహశీల్దార్ జవ్వాది వెంకటేశ్వరి, ట్రైనీ డిఎస్‌పి విష్ణు స్వరూప్, సిఐ వీరబాబు, ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు రెవెన్యూ సిబ్బంది పర్యటించారు. సముద్రపు ఒడ్డున ఉన్న వలస మత్స్యకారులను పునరావాస కేంద్రాలకు తరలిరావాలని సూచించారు.

మామిడికుదురు 216వ జాతీయ రహదారి పాశర్లపూడి, మామిడికుదురు, నగరంలో జలాశయంగా మారింది. భారీ వర్షాల తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం ప్రైవేటు విద్యాసంస్థలు మూసివేశారు. మామిడికుదురు ఆల్ క్యాస్ట్ కాలనీ, మొగలికుదురు వీవర్స్ కాలనీ, బి.దొడ్డవరం ఇందిరమ్మ కాలనీ, పాశర్లపూడి సత్రంతోట జలాశయాలుగా మారాయి. సముద్రతీర గ్రామాలైన కరవాక, ముత్యాలపాలెం, గోగన్నమఠంలో సహాయ చర్యలు చేపట్టారు. లూటుకుర్రు పిహెచ్‌సి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. తహశీల్దారు రియాజ్ హుస్సేన్, ఎంపిడిఒ కె.వెంకటేశ్వరరావు సముద్రతీర గ్రామాల్లో సహాయ పునరావాస చర్యలు పర్యవేక్షిస్తున్నారు.

మండపేట గాలి కారణంగా చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగి పడటంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. వర్షం కారణంగా రోడ్లు లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా తాపేశ్వరం ద్వారపూడి రోడ్డు, మండపేట ఏడిద రోడ్లు చెరువును తలపిస్తున్నాయి.

ముమ్మిడివరం భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పోలీస్ స్టేషన్, తహశీల్దార్ కార్యాలయం, సబ్ ట్రెజరీ, వ్యవసాయ శాఖ కార్యాలయాల ఆవరణలు మోకాల్లోతు నీట మునిగాయి. బళ్లగేటు సెంటర్ నుంచి వెళ్లే ఆసుపత్రుల రహదారి, మార్కెట్ ప్రాంతంలోని మండబయలు, జిఎంసి బాలయోగి కాలనీలు వర్షపు నీటి ముంపులో చిక్కుకున్నాయి.

కాట్రేనికోన మండలంలో విస్తరంగా వర్షాలు కురుస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. కోత కోసిన వరి పనలు నీటిలో మునిగిపోయి తేలియడుతున్నాయి. వర్షాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. ఎప్పటికప్పుడు సరఫరాను పునరుద్ధరణ చేస్తున్నారు. ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాన్ని సిద్ధంగా ఉంచినట్టు తహశీల్దారు సత్యనారాయణ తెలిపారు. తీర ప్రాంత మత్స్యకార గ్రామాల్లో ప్రజలను అధికారులు అధికారులు అప్రమత్తం చేశారు. మగసానతిప్ప గ్రామ ప్రజలకు కాయగూరలను నిత్యావసర వస్తువులను సరఫరా చేశారు. ప్రతి మత్స్యకార గ్రామంలో ఉన్న తుపాను సెంటర్లను పునరావాస కేంద్రాలుగా సిద్ధం చేసి అధికారులు అప్రమత్తంగా ఉన్నారు.

సహాయక చర్యలపై కలెక్టర్ సమీక్ష

అమలాపురం : తుపాను నేపథ్యంలో తీర ప్రాంతాల్లోకంట్రోల్ రూములు ఏర్పాటు చేసి సహాయక పునరావాస చర్యలు చేపట్టాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా తహశీల్దార్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ నుంచి అధికారులతో ఆయన సమీక్షించారు. జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయని మంగళవారం మధ్యాహ్నానికి తుపాను తీరం దాటే అవకాశం ఉందని ఈ నేపథ్యంలో జిల్లాలో 37 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ముంపు బారిన పడే బాధితులు ఈ పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందాలని సూచించారు. ఈ నెల 6వ తేదీ మధ్యాహ్నం వరకు తుపాను ప్రభావం ఉంటుందని, అదే సమయంలో గంటకు వంద కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, అత్యవసరమైన పనులు ఉంటే తప్ప ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు రాకూడదని చెప్పారు. ఈ నెల 4, 5న విద్యా సంస్థలకు సెలవు ప్రకటించినట్టు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలకు కూడా సెలవు ప్రకటించామన్నారు. ధాన్యం సేకరణ ప్రక్రియపై ఆయన ఆరా తీశారు. రైతుకు ఏ విధమైన నష్టం వాటిల్లకుండా అధికారులు తోడుగా నిలవాలని ఆదేశించారు. ఎస్‌పి ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా యంత్రాంగం సాయంతో చర్యలు చేపట్టామన్నారు. 24 గంటలూ నిరంతరాయంగా విధుల్లో ఉండాలన్నారు. తుపాను ప్రభావంతో ఎవర్కైనా ఇబ్బందులు ఉంటే పోలీస్ కంట్రోల్ రూమ్ లేదా కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌ను ఫోన్‌లో సంప్రదించి సహాయక చర్యలు పొందవచ్చని తెలిపారు.



రామచంద్రపురంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి వేణు



మూతపడిన కోటిపల్లి రేవు



కాట్రేనికోనలో సిద్ధంగా ఉన్న ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు



క్రీడా పరికరాలను ప్రదర్శిస్తున్న కలెక్టర్, జెసి

క్రీడల్లో జాతీయ స్థాయిలో రాణించాలి

ప్రజాశక్తి-అమలాపురం

ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొని జాతీయ స్థాయిలో రాణించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా యువతకు పిలుపు నిచ్చారు. ఆడుదాం ఆంధ్ర రాష్ట్రవ్యాప్త క్రీడా పోటీల నిర్వహణ సందర్భంగా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్, ఆడుదాం ఆంధ్ర నోడల్ అధికారి ఎస్.నూపుర్ అజయ్ సోమవారం క్రీడా పరికరాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ క్రీడలు శారీరక దారుఢ్యానికి, ఆరోగ్యానికి క్రీడా ప్రతిభను చాటుకునేందుకు ఉపయోగపడు తాయన్నారు. ఈ పోటీలు 5 స్థాయిల్లో గ్రామ వార్డు సచివాలయ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు జరుగుతాయన్నారు. 15 సంవత్సరాలు దాటి 60 ఏళ్ల లోపు ఉన్న స్త్రీ, పురుషులందరూ వారి గ్రామ వాలంటీర్ల ద్వారా డిసెంబర్ 14వ తారీఖు లోపు నమోదు చేయించుకోవలసిందిగా, 15వ తేదీ నుంచి జిల్లాలో అన్ని సచివాలయ స్థాయి నుండి క్రీడా పోటీలు ప్రారంభిస్తామని తెలిపారు. గ్రామ సచివాలయ పరిధిలో నివసిస్తున్న చదువుతున్న, తాత్కాలిక నివాసులు అర్హులని, ప్రభుత్వ ఉద్యోగులు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు అర్హులు కాదన్నారు. ఒక క్రీడాకారుడు గరిష్టంగా 2 క్రీడల్లో పాల్గొనవచ్చునని తెలిపారు. నాకౌట్ పద్ధతిలో క్రీడలు నిర్వహిస్తారని. ఈ క్రీడలు పురుషులకు స్త్రీలకు వేరు వేరుగా పోటీలు నిర్వహిస్తారన్నారు. https://aadu-damandhra.ap.gov.in వెబ్‌సైట్‌లో క్రీడా జట్లు నమోదు చేసుకోవాలన్నారు. సాధ్యమైనంత ఎక్కువ జట్లను జిల్లాలో, గ్రామ వార్డు సచివాలయ స్థాయిల్లో నమోదు చేయాల్సిందిగా అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. గ్రామ వార్డు సచివాలయ స్థాయిల్లో ఉపయోగించే బేసిక్ క్రీడా పరికరాల కిట్లను, మండల స్థాయిలో బహుమతిగా పొందే ప్రొఫెషనల్ కిట్లను ఈ కార్యక్రమంలో ప్రదర్శించారు. అనంతరం ఆయన బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి కె.భీమేశ్వ రరావు, డిఇఒ కమల కుమారి, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సిఇఒ, జిల్లా ముఖ్య శిక్షకులు సురేష్ కుమార్ పాల్గొన్నారు.



ఆకు మడి వేసేందుకు సిద్ధం చేసిన చేను

రబీ పనుల్లో బిజీగా రైతులు

ప్రజాశక్తి-మండపేట

ఖరీఫ్ సీజన్‌లో వరి దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో ఇప్పటికే ధాన్యం విక్రయించిన రైతులు రబీ పంట కోసం సిద్ధమవుతున్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు మేరకు గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు నేపథ్యంలో ఆకుమడి, వెదజల్లేందుకు వ్యవసాయ పనులు ముమ్మరంగా చేస్తున్నారు. ఆలమూరు డివిజన్ పరిధిలోని మండపేట, ఆలమూరు, రాయవరం మండలాల్లోని 56,104 ఎకరాల్లో వరి పంటను వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. డిసెంబర్ మొదటి వారం నాటికి ఆకుముడులు, వెదజల్లు ప్రక్రియను పూర్తి పూర్తిచేసుకుని డిసెంబర్ నెలాఖరు నాటికి వరి నాట్లు వేసుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. దీనిలో భాగంగా పంట చేలను ట్రాక్టర్లతో దున్నుతున్నారు. మేలు రకాల విత్తనాల కోసం వ్యవసాయ అధికారులను సంప్రదిస్తున్నారు. అధికారులు ముందస్తు చర్యలు చేపట్టడంలో భాగంగా విత్తనాలు ఎరువులు అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టాలని పలువు రైతులు కోరుతున్నారు. ఎక్కడికక్కడ ధాన్యం ఎగుమతులు నిలిచి పోయి ధాన్యం తడవకుండా ఉండేందుకు రైతులు ఏర్పాట్లు చేసుకున్నారు. కళ్లాల్లోని ధాన్యం తడిసి పోకుండా ఉండేందుకు బరకాలు కప్పి ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవడంలో మునిగిపోయారు.

ఫార్మసీ విద్య ద్వారా పలు అవకాశాలు

ప్రజాశక్తి-రావులపాలెం

ఫార్మసీ విద్యని అభ్యసించడం ద్వారా అనేక ఉద్యోగావకాశాలు లభించే అవకాశం ఉందని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. రావులపాలెంలోని లిధియా కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో మొదటి సంవత్సరం బి-ఫార్మసీ, ఫార్మా-డి 2023-24 బ్యాచ్ విద్యార్థులకు సోమవారం తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో గొల్లపల్లి సూర్యారావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థి దశలో విద్యను సక్రమంగా అభ్యసించడం ద్వారా వారి భవిష్యత్తు బంగారు బాటక మారుతుందని ఆయన విద్యార్థులకు సూచించారు. ఫార్మసీరంగంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెండుగా లభిస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా హాజరైన విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులకు ఫార్మసీ విద్య గురించి, ఆ రంగంలో లభిస్తున్న ఉద్యోగ అవకాశాల గురించి ప్రత్యేకంగా వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.మనోహర్ బాబు మాట్లాడుతూ ఫార్మసీ విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ గొల్లపల్లి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి గొల్లపల్లి

ఫార్మసిస్ట్‌పై ఆర్‌డిఒకు ఫిర్యాదు

ప్రజాశక్తి-రామచంద్రపురం

మందుల షాపు యజమాని తన షాపులోనే వైద్యం చేస్తూ డాక్టర్ అవతారం ఎత్తాడని గ్రామస్తులు ఆర్‌డిఒకు గ్రీవెన్స్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. హర్ష సాయి మెడికల్స్ పేరుతో సిహెచ్ నాగరాజు అనే వ్యక్తి ఇటీవల వైద్యుడుగా చాలామణి అవుతూ షాపులోనే వైద్యం చేస్తున్నాడని, ఇతనివైద్యం వికటించి ఇద్దరు పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. అధికారులు అతడిపై చర్యలు చేపట్టకపోవడంతో స్పందనలో ఫిర్యాదు చేశారు. అతడిపై చర్యలు తీసుకోవాలని వారు ఆ ఫిర్యాదులో కోరారు.




తాపేశ్వరంలో ప్రమాదకరంగా కల్వర్టు

ప్రమాదాలకు నిలయంగా శిథిల కల్వర్టులు

ప్రజాశక్తి-మండపేట

నిత్యం రద్దీగా ఉండే మండలంలోని పలు రోడ్లలో కల్వర్టులు ప్రమాదకరంగా మారడంతో ప్రయాణికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఏడిద, సీతానగరం, మారేడుబాక, తాపేశ్వరం, అర్తమూరు వెళ్లే ఆర్.అండ్.బి రోడ్డు, కాలనీలలో కల్వర్టులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. దీంతో స్థానికులకు, ప్రయాణికులకు అవస్థలు తప్పడంలేదు. వీటికి ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. ఈ కల్వర్టులకు ఇరువైపులా ఎటువంటి రక్షణ గోడలు లేకపోవడం తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు, ప్రయాణికులు చెబుతున్నారు. రాత్రి సమయాల్లో ప్రయాణం మరింత ప్రమాదకరంగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరితగతిన కల్వర్టులకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

కార్టూ'నిజం'



డబుల్ ఇంజన్ అంటే.. ఒకటి మతం పేరుతో తెచ్చుకునే అధికారం.. రెండు ఉన్న వాళ్లను పడగొట్టి తెచ్చుకునే అధికారం..!!

ఎస్ఆర్ షాపింగ్ మాల్ ప్రారంభం

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురంలో ఎస్ఆర్ షాపింగ్ మాల్ 12వ బ్రాంచ్‌ను నిర్వాహకులు సోమవారం ఘనంగా ప్రారంభించారు. షాపింగ్ మాల్‌ను మంత్రి విశ్వరూప్ ప్రారంభించారు. అమలాపురం ఎంపీ అనురాధ పట్టుచీరల సెక్షన్, పి.గన్నవరం ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు కిడ్స్ వేర్ కౌంటర్, కలెక్టర్ హిమాన్షు శుక్లా జెంట్స్ వేర్ సెక్షన్, ఎంఎల్‌షి బొమ్మి ఇజ్రాయెల్ లేడీస్ సెక్షన్, అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్ గొల్లపూడి డేవిడ్ పిల్లల సెక్షన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నటి రాశీఖన్నా సందడి చేశారు. ఆమెతో ఫోటోలు దిగేందుకు యువత పెద్ద ఎత్తున పోటీపడ్డారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లా డుతూ అమలా పురంలో ఇలాంటి షాపింగ్ మాల్స్ రావడం వల్ల పట్టణం అభివృద్ధి చెంద డంతో పాటు ఉద్యోగ అవ కాశాలు దొరు కుతాయని తెలి పారు. అనం తరం ఎస్ఆర్ షాపింగ్ మాల్ యాజ మాన్యానికి శుభా కాంక్షలు తెలిపారు. ఎంపీ అనురాధ మాట్లాడుతూ ఎస్ఆర్ షాపింగ్ మాల్లో మహిళలు ఎక్కువ మంది పని చేస్తున్నారని, మహిళలకు ఉద్యోగా వకాశాలు కల్పించిన ఎస్ఆర్ షాపింగ్ మాల్ ఎమ్‌డి కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటైన జిల్లాలో వివిధ రకాల షాపింగ్ మాల్స్ వస్తున్నాయని, జిల్లాలోని ముఖ్యమైన ప్రాంతాల్లో ఇలాంటి షాపింగ్ మాల్ ఏర్పాటు చేస్తే రకరకాల డిజైన్లతో కూడిన దుస్తులు డోర్ స్టేప్ వద్దే దొరికే అవకాశం ఉందన్నారు. షాపింగ్ మాల్స్ ఏర్పాటు వల్ల ఈ ప్రాంతవాసులకు ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని అన్నారు. ఎస్ఆర్ షాపింగ్ మాల్ ఎండీ ఎస్ఆర్.గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ రానున్న పండుగల కోసం ప్రత్యేక ఆఫర్లు ఇవ్వనున్నామని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి వచ్చిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల్ డైరెక్టర్ ప్రసాథెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో పాల్గొన్న సినీ నటి రాశీఖన్నా



షాపింగ్ మాల్ ప్రారంభిస్తున్న మంత్రి విశ్వరూప్

స్పందనలో సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి-అమలాపురం

ఎంతోవ్యయ ప్రయాసల కోర్చి జగనన్నకి చెబుదాం స్పందన కార్యక్రమాలు విచ్చేసే అర్జీదారుల సమస్యలపై సానుకూలంగా స్పందించి సంతప్తికర స్థాయిలో అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి భవన్ నుంచి జిల్లా స్థాయి జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం జిల్లా స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్.సత్తి బాబులు అర్జీదారుల నుంచి సుమారు 41 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా విచారించి తగు పరిష్కార మార్గాలు అర్జీదారుడు సంతప్తి చెందే స్థాయిలో చూపాలని ఆదేశించారు. గడువు దాటిన అర్జీలు లేకుండా ఒకసారి సమర్పించిన అర్జీ మరలా అదే అంశంపై పునరావృతం కాకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి అర్జీపై సకాలంలో పరిష్కార మార్గాలు చూపుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహణ తీరు పట్ల అర్జీదారుల్లో విశ్వసనీయతను పెంపొందించాలన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనంతో వ్యక్తి మృతి చెందాడు. నిడదవోలు మండలం మునిపల్లికి చెందిన భావన రాము తణుకు నుంచి స్వగ్రామానికి బయలుదేరి వెళ్తుండగా ఉండ్రాజవరం వద్ద తణుకు వైపు వేగంగా వెళ్తున్న మరొక ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వైద్య సహాయం నిమిత్తం తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో రాము(55) మరణించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎస్ఐ కె.రామారావు తెలిపారు.

చిక్కాలలో ఎక్సైజ్ దాడులు

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలం చిక్కాలలో సెబ్ ఇన్‌స్పెక్టర్ విటివివి.సత్యనారాయణ ఆదేశాల మేరకు సోమవారం సిబ్బంది అక్రమ సారా, మద్యం విక్రయాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో చిక్కాల గ్రామానికి చెందిన పాతనేరస్తుడు కె.రాధాకృష్ణను అదుపులోనికి తీసుకొని చాగల్లు తహాశీల్దార్ ఎదుట హాజరు పరచి బైండోవర్ చేశామని సిఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ జి.బసంతి, సిబ్బంది పాల్గొన్నారు

నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి - సీతానగరం



సోమవారం సీతానగరం మండలంలో ఎక్సైజ్ సిఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎక్సైజ్ సిబ్బంది నాటు సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సింగవరం గ్రామానికి చెందిన మార్గాన్ని సూరిబాబు, వంగలపూడి గ్రామానికి చెందిన పెనుబోతు ఏడుకొండల వద్ద 30 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. కోర్టులో హాజరు పరుస్తామని సిఐ సత్యనారాయణ తెలిపారు.

17న వైసిపి బస్సు యాత్ర

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లిలో ఈ నెల 17న సామాజిక సాధికారత బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్లు గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకట్రావు తెలిపారు ఈ కార్యక్రమాన్ని దేవరపల్లిలో నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమంలో జగనన్న పాలనలో ప్రజలకు జరిగిన మేలును, అభివృద్ధి పథకాలను పార్టీ నాయకులు వివరిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి వైసిపి నాయకులు, కార్యకర్తలు అందరూ హాజరు కావాలని కోరారు



సముద్ర తీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

సముద్ర తీరంలో కలెక్టర్ పరిశీలన

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

తుపాను నేపథ్యంలో సోమవారం కాకినాడ జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా రెవెన్యూ అధికారులతో కలిసి ఉప్పాడ సముద్రతీరాన్ని పరిశీలించారు. మండలం ఉప్పాడ గ్రామానికి సంబంధించి సూరాడపేట మండల పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని, ఇతర ఏర్పాట్ల గురించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తుపాను ప్రభావిత ప్రాంతాలైన ఉప్పాడ గ్రామానికి చెందిన సూరాడపేట, మాయాపట్నం, జగ్గరాజుపేట, బజారువీధీ ప్రాంతాలకు చెందిన సుమారు 300 మందిని ఈ పునరావాస కేంద్రానికి తరలించినట్టు తెలిపారు. పునరావాస కేంద్రంలో ఉన్నవారందరికీ భోజనం, తాగునీరు, వైద్య శిబిరం, జనరేటర్ వంటి ఇతర సదుపాయాలు కల్పించినట్టు చెప్పారు. చిన్నారులకు పాలు, గుడ్లు అందించాలని, పునరావాస కేంద్రంలో ఉన్న వారి వివరాలన్ని సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పునరావాస కేంద్రంలో ఉన్నవారికి కలెక్టర్ భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దారు జివిస్.ప్రసాద్, ఉప్పాడ, అమీనాబాద్ గ్రామాల సర్పంచులు ఉమ్మిడి జాన్, మణికంఠ, ఇతర అధికారులతో పాల్గొన్నారు.

సామర్లకోటలో రైల్వే హెల్ప్ డెస్క్

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

తుపాను కారణంగా ప్రయాణికుల సేవల్లో భాగంగా సామర్లకోట రైల్వే స్టేషన్లో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసారు. ఒకటో నంబర్ ప్లాట్ ఫారంపై ఈ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి ఒకఅధికారిని నియమించారు. తుపాను కారణంగా దక్షిణమధ్య రైల్వేలో సుమారు 144 రైళ్లను రద్దు చేసినట్టు రైల్వే స్టేషన్ మేనేజర్ రమేష్ చెప్పారు. సామర్లకోట నుంచి వివిధ ప్రాంతాలకు ప్రయాణించేందుకు ముందుగా రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులకు ప్రయాణ సదుపాయం, పలురైళ్ల సమాచారం అందించేందుకు ఈ హెల్ప్ డెస్క్ ద్వారా సేవలనందిస్తున్నట్టు చెప్పారు. ప్రయాణికులు రైళ్ల సమాచారం కోసం సామర్లకోట స్టేషన్‌కు 0884-2327010, రాజమండ్రి స్టేషన్‌కు 0883-2420541, తుని స్టేషన్‌కు 08854-252172 నంబర్ల ద్వారా సంప్రదించి వివరాలు పొందవచ్చన్నారు. 24 గంటల పాటు ఈ హెల్ప్ డెస్క్ సేవలు అందుబాటులో ఉంచుతున్నందున ప్రయాణికులు ఈ సేవలను వినియోగించు కావాలని స్టేషన్ మేనేజర్ రమేష్ తెలిపారు.

చివరి ధాన్యం గింజ వరకూ కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - చాగల్లు



రోడ్లపై ధాన్యం రాశులను పరిశీలిస్తున్న జెసి

జిల్లాలో చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేయాలని జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ అధికారులను ఆదేశించారు. ఆదివారం రాత్రి కొ చాగల్లు శివారు నందమూరి బ్రిడ్జి వద్ద నాలుగు ఎకరాల సంబంధించిన దాన్యం రాశిని రైసు మిల్లుకు తరలించాని రెవెన్యూ అధికారులను ఆయన ఆదేశించా రు. వ్యవసాయ శాఖ అధికారి కె.గోపాలకృష్ణ మాట్లాడుతూ చాగల్లు మండలంలో 7,500 ఎకరాలకు 20 ఎకరాల్లో ధాన్యం మాత్రమే ఉందన్నారు. వంతెన వద్ద రైతు అనారోగ్యంతో ఉండడంతో నాలుగు ఎకరాల ధాన్యాన్ని మిల్లుకు తరలించలేదన్నారు. సిఎం ఆదేశాల మేరకు రైతులు ఎవరు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఆఫ్‌లైన్ కొనుగోళ్లను చేపట్టామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో ఎక్కడా ధాన్యం రాసులు లేకుండా మిల్లులకు తరలిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెసి తేజ్ భరత్, వ్యవసాయ శాఖ ఎడి పి.చంద్రశేఖర్, ఆర్‌డిఓ నాయక్, తహశీల్దార్ కె.రాజ్యలక్ష్మి, ఎంపిడిఓ బి.రాంప్రసాద్, రెవెన్యూ, వ్యవసాయ పాల్గొన్నారు.

కండక్టర్ ప్రసాదరావుకు డాక్టరేట్

ప్రజాశక్తి - గోపాలపురం



డాక్టరేట్‌ను అందుకుంటున్న కండక్టర్ ప్రసాదరావు

సాహిత్యం, చదరంగంలో విశేష కృషి చేస్తున్న వేలచింతలగూడేనికి చెందిన ఆర్‌టిసి కండక్టర్ కౌలూరి ప్రసాదరావుకు గౌరవ డాక్టరేటు లభించింది. సోమవారం ఆయన మాట్లాడారు. చెన్నయ్ టి.నగర్ సోషల్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో ఇంటర్నేషనల్ పీస్ సమ్మిట్ అధ్యక్షుడు హెచ్‌బి ప్రొఫెసర్, శాస్త్రవేత్త డాక్టర్ మధుకిషాన్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ అందుకున్నానని తెలిపారు. అంతర్జాతీయ పీస్ ఐకాన్ అవార్డు కూడా అందుకున్నానని తెలిపారు. తాను ప్రస్తుతం జంగారెడ్డి గూడెం ఆర్‌టిసి డిపోలో కండక్టరుగా విధులు నిర్వర్తిస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు. ఆయన గతంలో కవిమిత్ర, కథాభారతి, సాహితీ చదరంగ ప్రపూర్ణ, కళారత్న వంటి బిరుదులు కూడా అందుకున్నారు.

వీరభద్రరావుకు 'గురుతేజం' అవార్డు

ప్రజాశక్తి- కడియం



అవార్డు గ్రహీతను సత్కరిస్తున్న నిర్వాహకులు

కడియం గ్రామానికి చెందిన ప్రభుత్వ గణిత ఉపాధ్యాయుడు ఉంగరాల వీరభద్రరావుకి గురుతేజం అవార్డు లభించింది. రాజమహేంద్రవరం పుష్కర్ వనంలో ఆదివారం జరిగిన కాట్వా ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో పలువురు ప్రముఖులు భద్రరావుని ఘనంగా సత్కరించి ఈ పురస్కారాన్ని అందించారు. 26 ఏళ్లగా గణిత శాస్త్రాన్ని బోధిస్తూ ఎంతోమంది విద్యార్థులను ఆయన తీర్చిదిద్దారు. కాట్వా నేతలు బంగార్రాజు, కోలా సత్యనారాయణ, చలం, చోడిశెట్టి బాలాజీ తదితరులు చేతుల మీదుగా భద్రరావు అవార్డుని అందుకున్నారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంఎల్ఎ కందుల దుర్గేష్, రాజానగరం ఎంఎల్ఎ జక్కంపూడి రాజా హాజరై భద్రరావును అభినందించారు. ఈ అవార్డు రావడం పట్ల కడియం ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు తదితరులు భద్రరావును అభినందించారు.

బాల కార్మికుల కోసం తనిఖీలు

ప్రజాశక్తి - సీతానగరం



రఘుదేవపురంలో ఇటుక బట్టీలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

కలెక్టర్ ఆదేశాల మేరకు సీతానగరం మండలంలో పెట్రోల్ బంకులు, హోటళ్లు, సామిల్లు, దుకాణాలు, ఇటుక బట్టీల్లో కార్మిక శాఖ అధికారులు బాలకార్మికులను గుర్తించేందుకు సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ కార్మిక అధికారి కార్తీక్ మాట్లాడుతూ దేశవ్యాప్త బాలకార్మికులు గుర్తింపులో భాగంగా సీతానగరంలో తనిఖీలు చేస్తున్నామని అన్నారు. 18 ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే రూ.20 వేల నుంచి రూ.50 వేల జరిమానా, 6 నెలల నుంచి మూడేళ్ల జైలు శిక్ష వర్తిస్తుందని హెచ్చరించారు. బాలలను పనిలో పెట్టుకుని వెట్టిచాకిరీ చేయించకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్మిక అధికారులు జబీనా, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

దుప్పిని స్వాధీనం చేసుకున్న అధికారులు

ప్రజాశక్తి - సీతానగరం



అధికారులు స్వాధీనం చేసుకుంటున్న దుప్పి

కుక్కల దాడిలో గాయపడిన దుప్పిని అటవీశాఖ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 1వ తేదీన అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం అటవీ ప్రాంతంలో ఒక వ్యక్తి మేకలు మేపుతూ సాయంత్రం ఇంటికి వస్తుండగా మేకలతో కలిసి ఒక దుప్పి వచ్చింది. దుప్పిపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. మేకల కాపరి దుప్పిని ఇంటికి తీసుకుని వెళ్లి సంరక్షించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. సోమవారం డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పద్మావతి ఆధ్వర్యంలో అచ్చియ్యపాలెంలో ఉన్న దుప్పిని స్వాధీనం చేసుకుని రాజమండ్రి ప్రధాన అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆవాస ప్రాంతానికి దుప్పిని తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డిఓ జివి.రంగారావు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వానంగా ఏడిద సావరం పుంత

ప్రజాశక్తి-మండపేట



అధ్వానంగా ఉన్న ఏడిద సావరం రోడ్డు

మండలంలోని ఏడిద గ్రామ శివారు సావరం నుంచి మండపేట పట్టణానికి చేరుకునేందుకు ఎంతో సౌకర్యవంతంగా ఉండే సావరం పుంత రోడ్డు గత కొంతకాలంగా అధ్వానస్థితికి చేరుకుంది. దీంతో ఆ గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సావరం ప్రజలు మండపేటకు ఏడిద గ్రామం మీదుగా వెళుతున్నారు. ఈ పుంత రోడ్డు నేరుగా మండపేట బైపాస్ రోడ్డు మీదుగా సత్యశ్రీ రోడ్డుకు కలుస్తుంది. అక్కడి నుంచి రాజారత్న, కలువపువ్వు సెంటర్, తదితర ప్రాంతాలకు వెళ్ళవచ్చు. సుమారు నాలుగు కిలోమీటర్ల ఉన్న ఈ రోడ్డంతా గోతుల మయంగా మారడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు ఈ రోడ్డు అభివృద్ధి చేయడంలో భాగంగా రోడ్డును కొంతమేర తవ్వేశారు. ఎన్నికల అనంతరం తిరిగి పనులు ప్రారంభం కాలేదు. దీంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. అధికారులు స్పందించి రోడ్డు అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

స్పందనలో అర్జీలు స్వీకరించిన ఆర్‌డిఓ



అర్జీలను స్వీకరిస్తున్న ఆర్‌డిఓ సీతారామారావు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఆర్‌డిఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆర్‌డిఓ సీతారామారావు అర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో సమస్యల పరిష్కారం కోసం స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పట్టణ పరిధిలో పరిశ్రమల కాలుష్యాన్ని అరికట్టాలని, పట్టాదారు పాసు పుస్తకం కోసం, ఆక్రమణల తొలగింపు కోసం, పట్టాదార్ పాస్ పుస్తకం కోసం తదితర దరఖాస్తులు అందయన్నారు. డివిజన్ స్థాయిలో అందిన ఈ అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు పంపించి వెంటనే ఈ సమస్యలు పరిష్కరించేలా ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఓ సరస్వతి, డిప్యూటీ తహశీల్దార్ భాను కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లింట విషాదం

గుండెపోటుతో పెళ్లి కొడుకు మృతి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్



ప్రేమించిన అమ్మాయిని మరో రెండ్రోజుల్లో వివాహం చేసుకోబోతున్నాడు. ఈ మేరకు ఏర్పాట్లు కూడా చేసుకున్నాడు. ఉత్సాహంగా వెళ్లి పెళ్లి దుస్తులను సైతం కొనుగోలు చేసుకున్నాడు. అంతలోనే గుండెపోటుకు గురై మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన జగ్గంపేట మండలం జి.మామిడాడలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పెళ్లింట విషాదం అలముకుంది. మండలంలోని మామిడాడ గ్రామానికి చెందిన వేగి ఏసురాజు(24) వాలంటీర్‌గా పని చేస్తున్నాడు. ప్రేమించిన అమ్మాయిని పెద్దల అంగీకారంతో మరో రెండు రోజుల్లో వివాహం చేసుకునేందుకు సిద్ధమయ్యాడు. ఆదివారం రాత్రి 12 గంటల సమయంలో పెళ్లి సామగ్రి తీసుకుని ఇంటికి వచ్చాడు. సోమవారం అనారోగ్యానికి గురి కావడంతో స్థానికంగా ఉన్న అర్‌ఎంపి వద్దకు వెళ్లి చూపించుకున్నాడు. ఇంటికి వచ్చిన అర గంటలో స్పృహ కోల్పోయాడు. వెంటనే స్థానికులు యువకుడిని ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. గుండెపోటుకు గురై మృతి చెందాడని తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం అలముకుంది.

వరి కళ్లాల పరిశీలన

ప్రజాశక్తి -గోకవరం

మండలంలోని పలు గ్రామాల్లో కళ్లాల్లో ధాన్యాన్ని సోమవారం మండల ప్రత్యేక అధికారి, డ్వామా పీడీ జగదాంబ పరిశీలించారు. తుపాను ప్రభావం కారణంగా రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఆరబెట్టిన ధాన్యమే కాకుండా పచ్చిధాన్యం, తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేసి మిల్లర్లకు పంపించాలని కలెక్టర్ ఆదేశించారన్నారు. తేమ ఉన్నా, లేకున్నా ప్రభుత్వం నిర్ణయించిన రేటుకే ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. రైతులు ఎవరకూ అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. ఆమె వెంట తహశీల్దార్ ఎ.శ్రీనివాస్, ఎఓ రాజేశ్వరి, సిబ్బంది ఉన్నారు.

నేడు పాఠశాలలకు సెలవు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తుపాను హెచ్చరికల నేపథ్యంలో జిల్లా లోని విద్యా సంస్థలకు మంగళవారం స్థానిక సెలవు దినంగా ప్రకటించినట్టు డిఇఓ ఎస్.అబ్రహాం సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు నుంచి కాకినాడ జిల్లా వరకు ఎపిలోని తీర ప్రాంతాలకు ప్రత్యేకంగా తుపాను హెచ్చరికలను వాతావరణ శాఖ జారీ చేసిందని, దీంతో 5వ తేదీన స్థానిక సెలవు దినంగా ప్రకటించాలని కలెక్టర్ ఆదేశించినట్టు తెలిపారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కొత్తపేట

కిడ్నీ వ్యాధిగ్రస్తునికి పలువురు సోమవారం ఆర్థిక సాయం అందించారు. బిళ్లకుర్రు శివారు మట్టపర్తి వారిపాలెంకు చెందిన మట్టపర్తి వెంకటేష్ కొద్ది రోజుల నుంచి కిడ్నీ సమస్యతో బాధ పడుతున్నాడు. అతడిని వైద్య చికిత్స కోసం హాస్పిటల్‌కు తీసుకెళ్లగా డాక్టర్లు రెండు కిడ్నీలూ పాడైపోయాయని తెలిపారు. దీంతో ఆయన తల్లి ఒక కిడ్నీ దానం చేయడానికి ముందుకొచ్చారు. కిడ్నీ మార్పిడికి సుమారు రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలిపారు. విషయం తెలుసుకున్న శెట్టిబలిజ సంఘ సభ్యులు వారం క్రితం రూ.20 వేలు, బిళ్లకుర్రు మాసాయిపేట యువత ద్వారా రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఎవరైనా దాతలు ముందుకొచ్చి ఆ యువకుడికి వైద్యం కోసం ఆర్థిక సాయం అందించాలని కోరారు.

ఓటరు క్లెయిములను పరిష్కరించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

బూత్ లెవెల్ ఆఫీసర్స్ ఓటర్ల నుంచి వచ్చే ఓటరు క్లెములను క్షుణ్ణంగా పరిశీలించి వాటిని పరిష్కరించాలని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్‌డిఓ జె.సీతారామారావు ఆదేశించారు. సోమవారం పెద్దాపురంలో సామర్లకోట, పెద్దాపురం మున్సిపల్ పట్టణాలకు సంబంధించిన బిఎల్‌ఒలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫోటో సిమిలర్ ఎంట్రీస్, డెమోగ్రాఫికల్ సిమిలర్ ఎంట్రీస్ ప్రాసెస్ చేసే విధి విధానాలను వివరించారు.

కిటకిట లాడిన భీమేశ్వరాయం

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

తుపాను కారణంగా వర్షం పడుతున్నా సామర్లకోట భీమేశ్వరాలయం సోమవారం కిటకిటలాడింది. కార్తీక మాస పూజలు మూడో సోమవారం ఆలయంలో ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము 4.30 గంటలకే స్వామి వారికి, అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలా త్రిపరసుందరీ అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. ఎలాంటి ఇబ్బందీ కలగకుండా దేవాదాయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు



నేలకొరిగిన విద్యుత్ స్తంభం

మండలం పోలేకుర్రు పంచాయతీ తూర్పుపేట, పి.మల్లవరం పంచాయతీ పత్తి గొందిలో ఆరు విద్యుత్ స్తంభాలు తుఫాను ప్రభావంతో నేలకొరిగాయి. దీంతో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తాళ్లరేవు విద్యుత్ శాఖ ఎఇ ఇసిహెచ్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ స్తంభాలను తొలగించి విద్యుత్తును పునరుద్ధరించారు.

యానాం వార్తలు

యానాంలో పాఠశాలలకు సెలవు

ప్రజాశక్తి - యానాం

మిచౌంగ్ తుపాన్ నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ప్రాణనష్టం, ప్రమాదం కలగకుండా ఉండేందుకు సెక్షన్ 144 అమలు చేస్తున్నట్లు ఆర్ఎఒ మునిస్వామి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి, ఇళ్ల నుంచి, రక్షణ శిబిరాల నుంచి బయటకు రాకుండా ఉండాలన్నారు. తుపాను నెల్లూరు - మచిలీపట్నం మధ్య తీరం దాటనున్న నేపథ్యంలో యానాంలో కుండపోత వర్షాలు ప్రభావం ఉండడంతో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలకు మంగళవారం సెలవు ప్రకటిస్తూ పుదుచ్చేరి డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ పి ప్రియదర్శిని సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఈ మేరకు ప్రాంతీయ విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్ సెలవును ధ్రువీకరించారు.



బోజనం వడ్డిస్తున్న ఎంఎల్ఎ

పలు ప్రాంతాల్లో ఎంఎల్ఎ పర్యటన

ప్రజాశక్తి - యానాం

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆదివారం అర్ధరాత్రి నుంచి సావిత్రి నగర్, గిరియం పేట, పరంపేట గ్రామాల్లో పర్యటించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే పనులను పర్యవేక్షించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్న కంట్రోల్ రూమ్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు. ఆయా గ్రామాల్లో ఉన్న స్కూల్స్‌లను పునరావాస కేంద్రాలుగా మార్చమన్నారు. మత్స్యశాఖ, రెవెన్యూ, అగ్నిమాపక, పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో ఉన్నవారికి సోమవారం సెంట్రల్ కిచెన్ ద్వారా ఏర్పాటు చేసిన భోజనాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి, ఎస్‌పి రఘునాయిగం, సిఐ షణ్ముగం, ఎస్ఐ కట్టా సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.



బృందంతో మాట్లాడుతున్న ఆర్ఎఒ

మరిన్ని ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు

ప్రజాశక్తి - యానాం

మిచౌంగ్ తుపాను యానాంపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నా అంచనాతో ప్రస్తుతం ఉన్న 20 మందితోపాటు మరో 20 మందితో కూడిన ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం యానాంకు చేరింది. ఆర్ఎఒ మునిస్వామి ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలతో భేటీ అయ్యారు. సావిత్రి నగర్, గిరియంపేట, దరియాలతిప్ప, ఫరంపేట, కురసంపేట, తదితర గ్రామాల్లో ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలతో కలిసి ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్ఎఒ మునిస్వామి పర్యటించారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ డిస్ట్రిక్టు జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం, తూ॥గో॥జిల్లా

M.V.O.P. 512/2019

Between:

Samudayapalepu Siva Durga Prasad, being minor represented by Father and next Friend Veera Venkata Ramana. ***...Petitioner***

AND

1: Chebolu Vamsi Prakash and 3 others.

R-4: Talisetti Veerababu, C/o. Akondi Krishna Sarma, S/o. Vyasa Murthy, Near Ratnagiri Resorts back side, Bendapudi Village, Thondangi Mandal - 533409.

...Respondent No.4

పై నెంబరు M.V.O.P. లో 4వ రెస్పాండెంట్‌కు నోటీసు అమలు కానందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం సదరు 4వ రెస్పాండెంట్ **ది. 15-12-2023వ సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై M.V.O.P. లో మీకు ఆక్షేపణలున్న తెలుపుకొనవలెను. లేని యెడల సదరు M.V.O.P. లో మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరని ఇందు మూలముగా తెలియపరచడమైనది.

బి.వి.ఎస్.టి.రామారావు

రాజమండ్రి అడ్వకేట్, గోరక్షణపేట

02-12-2023 రాజమండ్రి

In the Court of the Vth Addl. District Judge, Rajahmundry

A.S. 42/2017

Between:

G.Rangayamma ***...Appellant***

AND

Mutyala Bhagavannarayana (died) and Others ***...Respondents***

R-3: Rimmalapudi Leelavathi, W/o. Veerraju, D.No. 1-40, Vadlamuru, Kapileswarapuram Mandal.

పై నెంబరులో మీకు శ్రీ కోర్టు వారు నోటీసు నిమిత్తం **ది. 11-12-2023వ సం॥రం తేదీకి వాయిదా వేసియున్నారు.** కావున మీరు వాయిదా రోజు **ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయంగా గాని, వకీలు ద్వారా గాని పై కోర్టు వారిఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

సిహెచ్.వి.ప్రసాద్

అప్పిలెంటు తరపు అడ్వకేటు

రాజమండ్రి

In the Court of Principal Junior Civil Judge, Rajamahendravaram

O.S. 646/2010

O.S. 1395/2002

Between:

Boggavarapu Suryanarayana ***...Plaintiff***

AND

1. Boggavarapu Sitha Mahalakshmi (died)
2. Boggavarapu Subrahmanyeswara Sharma and 26 Others

...Defendants

To:

Boggavarapu Satyanarayana Murthy, S/o. (late) Satyanarayana, Hindu, aged 58 years, R/o. D.No. 5-77, Near Sivalayam, Tapeswaram, Mandapet Mandal, Alamuru J.C.J.

పై నెంబరు దావాలో శ్రీ కోర్టు వారు మీకు ఎన్నిసార్లు సమున్ల పంపిన అమలు జరుగక తిరిగి వచ్చుచున్నందున కాలయాపన జరుగుచున్నందున మీ హాజరు నిమిత్తం **ది. 20-12-2023వ సం॥నకు వాయిదా. ఆరోజున మీరు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు పై కోర్టు వారితో మనవి చేసుకోవలెను. లేని యెడల పై గ్రంథం మీ పరోక్షమున తీర్మానం చేయబడును.

(శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం)

ఇంద్రగంటి విశ్వనాథం

రాజమహేంద్రవరం వాది తరపు అడ్వకేట్

04-12-23 సెల్: 9849579614

In the Court of the 6th Addl. Junior Civil Judge, Kakinada

O.S. No. 670/2019

Between:

Messers Sri Venkata Rama Oil Industries Private Limited Company, Having its Registered Office at D.No. 15-7-66, Hussinpuram, Samalkota Mandal, East Godavari District, Andhra Pradesh, Represented by its Executive Director, Sri N.Srinivas. ***...Plaintiff***

AND

1) Venkateswara Traders, Represented by its Proprietor, Ch.Paidi Naidu, D.No. 4-3-3/1, Shop No. 5, Tarvanipeta Street, Mandapeta - 533308.

2) Ch.Paidi Naidu, S/o. Not known, Business, D.no. 4-3-3/1, Shop No. 5, Tarvanipeta Street, Mandapeta - 533308. ***...Defendants***

పై నెంబరు దావాలో 1వ మరియు 2వ ప్రతివాదులు అయిన మీకు ఎన్నిమార్లు దావా సమన్లు పంపిననూ పుచ్చుకొనక త్రిప్పి వేయుచున్నారు. పై నెంబరు దావా **ది. 28-12-2023వ తేదీ వాయిదా అయి ఉన్నది. సదరు తేదీని మీరు ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయముగా గాని, వకీలు గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియపర్చుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

భద్రిరాజు సుబ్బారావు

కాకినాడ వాది తరపు అడ్వకేటు

3-12-2023 సెల్: 9390209021